ప్రజా పక్షపాతి సీఎం జగనన్న


సంక్షేమ లబ్ధిని తెలియజేస్తున్న ఎమ్మెల్యే వెంకట్రామిరెడ్డి

గుంతకల్లు రూరల్: ప్రజా శ్రేయస్సు కోసం పరితపిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పాతకొత్తచెరువులో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. అధికారులు, సచివాలయ ఉద్యోగులు, నాయకులు, వలంటీర్లు, కార్యకర్తలతో కలిసి ఎమ్మెల్యే గ్రామంలో ప్రతి ఇంటి వద్దకు వెళ్లి ప్రజల బాగోగులు తెలుసుకుంటూ ముందుకు నడిచారు. వైఎస్సార్‌సీపీ పాలనలో సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటికీ లబ్ధి కలిగిందని తెలియజేశారు. గతంలో పథకాలు దాటాలంటే అధికారులు, పాలకుల చుట్టూ నెలల తరబడి ప్రదక్షిణలు చేయాల్సి వచ్చేదని, కానీ జగనన్న ప్రభుత్వంలో వలంటీర్లు నేరుగా ఇంటి గుమ్మం వద్దకే సంక్షేమ పథకాలను చేరుస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. మాటలతో ప్రజలను మాయ చేసే ప్రభుత్వం తమది కాదని, చెప్పిన మాటకు, ఇచ్చిన హామీకి కట్టుబడి పనిచేసే జగనన్న ప్రభుత్వం అని ప్రజలకు తెలియజేశారు. నాలుగేళ్ల క్రితం ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చారని గుర్తు చేశారు. గతంలో ఏ ఒక్క ప్రభుత్వం చేయని విధంగా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో జగనన్నను ప్రజలు చల్లని మనసుతో ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. ఎంపీడీఓ జాషువా, ఎంపీపీ బీవీ మాధవి, వైస్ ఎంపీపీ చింబిలి ప్రభావతి, జెడ్పీటీసీ కదిరప్ప, మార్కెట్ యార్డు చైర్మన్ ఎస్వీఆర్ మోహన్, కో ఆప్షన్ సభ్యుడు సిపాయి బాషా, సర్పంచ్ మల్లికార్జున, ఎంపీటీసీ వెంకటరెడ్డి, కిసాన్‌సెల్ జిల్లా కార్యదర్శి సోమిరెడ్డి, మండల కన్వీనర్ మోహన్, సింగిల్ విండో అధ్యక్షుడు సుంకిరెడ్డి, మత్స్య సంఘం ప్రెసిడెంట్ సహదేవ, సచివాలయ కన్వీనర్లు కుమారస్వామి, ప్రభాకర్‌రెడ్డి, నాయకులు, రాము, వినోద్, శ్రీనివాసులు, బొజ్జిరెడ్డి, భీమలింగ, రామలింగ, చాపల వెంకటేష్, సుధాకర్, నాగిరెడ్డి, రామలింగారెడ్డి పాల్గొన్నారు.

సీఎం జగన్ సభను విజయవంతం చేద్దాం



తాడిపత్రి టౌన్: నార్పలలో బుధవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో జరగనున్న జగనన్న వసతి దీవెన సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి కోరారు. ఈమేరకు ఆయన మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో తరలిరావాలని కోరారు.

యల్లనూరు: నార్పలలో బుధవారం తలపెట్టిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న వసతి దీవెన సభను జయప్రదం చేద్దామని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు ఈశ్వరరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు భోగతి ప్రతాప్‌రెడ్డి ప్రజలను కోరారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తొలిసారి ముఖ్యమంత్రి హోదాలో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి శింగనమల నియోజకవర్గానికి వస్తున్నారన్నారు. మండల నుంచి ప్రజలు పెద్దసంఖ్యలో తరలిరావాలని కోరారు.

క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ నేతకు పరామర్శ


సూర్యనారాయణరెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

పెద్దవడుగూరు: లక్ష్మంపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి గూడూరు సూర్యనారాయణరెడ్డిని మంగళవారం తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పరామర్శించారు. కొద్దిరోజులు అనారోగ్యంతో బాధ పడుతూ ఆసుపత్రి లో చికిత్స చేయించుకొని ఇంటికి వచ్చారు. ఎమ్మెల్యే ఇంటికి వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

సచివాలయం తనిఖీ


రికార్డులను పరిశీలిస్తున్న కమిషనర్ శేషన్న

గుంతకల్లుటౌన్: పట్టణంలోని 34వ వార్డు సచివాలయాన్ని మంగళవారం మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయ సిబ్బంది హాజరు పట్టిక, ఆయుష్మాన్‌భారత్ నమోదును పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. స్కూల్, అంగన్‌వాడీ కేంద్రాల విజిటింగ్ రికార్డులతో పాటు సంక్షేమ పథకాలు అమలవుతున్న తీరుతెన్నులు, స్పందన ద్వారా వచ్చిన అర్జీల పరిష్కారం తదితర వాటి గురించి ఆయన కార్యదర్శులను ఆరాతీశారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు


అనాథ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహిస్తున్న దృశ్యం

గుంతకల్లుటౌన్: పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్‌లో మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహానికి ఆ నలుగురు సేవా సమితి సభ్యులు అంత్యక్రియలు నిర్వహించి మానవత్వాన్ని చాటుకున్నారు. వన్‌టౌన్ పోలీసుల విజ్ఞప్తి మేరకు మంగళవారం ఆ నలుగురు సేవాసమితి సభ్యులు మృతదేహాన్ని పాతగుంతకల్లులోని హిందూ శ్మశానవాటికకు తరలించి అంతిమ సంస్కారాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ నలుగురు సేవాసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మంజుల వెంకటేష్, ఉపాధ్యక్షులు శ్రీధర్ రెడ్డి, రవీంద్రా, కరాటే రవి, కోశాధికారి చంద్రమౌళి, సభ్యులు రాజశేఖర్, లింగేశ్వర్, నవీన్, అశోక్, పురుషోత్తమ్‌ను వన్‌టౌన్ పోలీసులు అభినందించారు.

ప్రజారోగ్యంతో చెలగాటమాడితే ఉపేక్షించేదిలేదు


చెర్రీస్ తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ కళ్యాణ చక్రవర్తి

అనంతపురం క్రైం: కనీస శుభ్రత పాటించకుండా ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడితే ఉపేక్షించేది లేదని అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ కళ్యాణ చక్రవర్తి నిర్వాహకులను హెచ్చరించారు. మంగళవారం బుక్కరాయసముద్రం కొట్టాలపల్లిలోని ఓ చెర్రీస్ కేంద్రాన్ని ఫుడ్ సేఫ్టీ అధికారి పీ తస్లీంతో కలిసి అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. బొప్పాయితో చెర్రీస్ తయారీలో సురక్షిత ప్రమాణాలు పాటించలేదని అధికారుల తనిఖీలో తేలింది. ఆహార తయారీ కేంద్రాలు తప్పక పరిశుభ్రత ప్రమాణాలు పాటించాలన్నారు. ఫుడ్ సేఫ్టీ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ) లైసెన్స్ లేకుండా చెర్రీస్ తయారీ కేంద్రాన్ని ఏవిధంగా నిర్వహిస్తున్నారని, నిర్వాహకులకు ఆయన నోటీసులు జారీ చేశారు. లైసెన్స్, పరిశుభ్రత పాటించని పక్షంలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఘనంగా భావ నారాయణస్వామి కల్యాణం


అలంకరణలో భద్రావతి నారాయణ భావ నారాయణ స్వామి

యాడికి: మండల కేంద్రంలోని మార్కండేయస్వామి ఆలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం భద్రావతి నారాయణస్వాముల కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆలయ అర్చకులు స్వాములను ప్రత్యేకంగా అలంకరించి పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామానికి చెందిన లింగం పల్లి నారాయణ్మ, నాగరంగయ్య దంపతులు ఉభయ దారులుగా వ్యవహరించి స్వామి వారి కల్యాణాన్ని నిర్వహించారు. భారీగా భక్తులు హాజరై మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ గురుమూర్తి, ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు, ఉప సర్పంచు చంద్రమోహన్, ఎంపీటీసీలు నాగరాజు, వెంకట నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మలేరియా నిర్మూలనకు కృషి చేద్దాం


యల్లనూరు: ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, ఆరోగ్య సిబ్బంది

యల్లనూరు: మలేరియా నిర్మూలనకు కృషి చేద్దామని తిమ్మంపల్లి వైద్యురాలు కీర్తన, సాయి నాగశ్రీ తెలిపారు. మంగళవారం ప్రపంచ మలేరియా దినోత్సవంపై పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. తిమ్మంపల్లి బస్టాండులో మానవహారంగా నిలబడి ప్రజలకు అవగాహన కల్పించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దోమలు ఎక్కువగా ఉన్న ప్రదేశాల్లో ఆయిల్ బాల్స్‌ను వేయాలన్నారు. ఎంపీహెచ్ఈవో వీరనారాయణ, పీహెచ్ఎన్ జగదాంబిక, సూపర్‌వైజర్లు రాము, విజయలక్ష్మి, ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

గుత్తి: స్థానిక ప్రభుత్వాసుపత్రిలో మంగళవారం ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆసుపత్రి సూపరింటెండెంట్ ఎల్లప్ప, మెడికల్ ఆఫీసర్ విష్ణుమూర్తి ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. స్థానిక ప్రభుత్వాసుపత్రి వద్ద నుంచి ఎన్టీఆర్ సర్కిల్ వరకు ర్యాలీ సాగింది. మలేరియా పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచించారు. ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

యాడికి: మండల కేంద్రం, రాయలచెరువు పీహెచ్‌సీలలో మంగళవారం ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని వైద్యాధికారులు ప్రవీణ్‌కుమార్, అప్పయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రజలకు అవగాహన కల్పిస్తూ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. మలేరియా అంతం నా తోనే ప్రారంభం అనే నినాదాలు చేశారు.

గార్లదిన్నె: ప్రతి ఒక్కరూ దోమ తెరలు వాడి దోమలు నుంచి రక్షణ పొందాలని పీహెచ్‌సీ డాక్టర్ గౌతమి పేర్కొన్నారు. మంగళవారం ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా వైద్య సిబ్బంది పీహెచ్‌సీ నుంచి బస్టాండ్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో యర్రగుంట్ల పీహెచ్‌సీ డాక్టర్ హసీన, సీహెచ్ఓ లోక్‌నాథ్, పీహెచ్ఎన్ నాగమ్మ, హెల్త్ సూపర్‌వైజర్ విశ్వనాథ రావు, కృష్ణ మోహన్, ఎమ్ఎల్‌పీహెచ్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం: ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రత పాటించాలని మండల వైద్యాధికారి స్వాతిలక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. సీహెచ్ఓ మోహన్‌రావు, సూపర్ వైజర్ ఈశ్వరమ్మ, పీహెచ్ఎన్ చెన్నమ్మ, హెల్త్ అసిస్టెంట్లు నాగరాజు, ఆనంద్, భవాని, గౌతమి, మంజు భార్గవి, యామిని, జ్యోతి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దవడుగూరు: మలేరియా వ్యాధి ని తరిమికొట్టడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పెద్దవడుగూరు, క్రిష్టిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు శ్రీనివాసబాబు, డాక్టర్ అమర్‌నాథ్, క్రిష్టిపాడు డాక్టర్ శ్రీనివాసరెడ్డి, గుత్తి మలేరియా అధికారి చంద్రానాయక్ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలో, చిత్రచేడు, క్రిష్టిపాడులో ప్రపంచ మలేరియా దినోత్సవం జరిపారు. హెల్త్ సూపర్‌వైజర్ శ్రీనివాసులు, సీహెచ్ఓ చిట్టితల్లి, పీహెచ్ఎన్ హేమలత, ఎంపీహెచ్ఈఓ వినయ్‌కుమార్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యాధికారిపై చర్యలు తీసుకోండి


డీఎంహెచ్‌ఓకు వినతిపత్రం అందిస్తున్న ఎన్‌జీఓ సంఘం నేతలు, బేతాపల్లి వైద్య సిబ్బంది

అనంతపురం సప్తగిరి సర్కిల్: బేతాపల్లి వైద్యాధికారిపై చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్ఓ వీరబ్బాయిని ఎన్‌జీఓ సంఘం, బేతాపల్లి ఉద్యోగులు స్థానిక కార్యాలయంలో మంగళవారం కలిసి వినతి పత్రం అందించారు. ఉద్యోగులను ఇబ్బందులకు గురి చేస్తూ వారిని మానసికంగా హింసకు గురి చేస్తున్నాడని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగులను నిత్యం అనుచిత వ్యాఖ్యలు చేస్తూ ఇష్టానుసారంగా మాట్లాడి క్షోభకు గురి చేస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏపీ ఎన్‌జీఓ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాధవ, జిల్లా కార్యదర్శి చంద్రమోహన్, జిల్లా సహ అధ్యక్షులు వెంకటేష్‌బాబు, జిల్లా ఉపాధ్యక్షులు రవికుమార్, జమీలాబేగం, జిల్లా కోశాధికారి బషీర్ అహమ్మద్, సిటీ అధ్యక్ష, కార్యదర్శులు మనోహర్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, గుత్తి తాలూకా అధ్యక్షులు శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ, రామాంజనేయులు, బేతాపల్లి వైద్యా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గుత్తిలో 'జగనన్నే మా భవిష్యత్తు'


జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

గుత్తి: పట్టణంలోని 15వ వార్డులో మంగళవారం జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని ముమ్మరంగా నిర్వహించారు. వార్డు కౌన్సిలర్ అంజల, వార్డు ఇన్‌చార్జ్‌లు హమాలి రామాంజి, అరటి పండ్ల చంద్ర, ప్రసాద్ ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. అర్హులై ఉండి పథకాలు అందకుంటే వెంటనే దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. ఆయా ఇంటి యజమానుల అనుమతితో మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లను అతికించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు సుధాకర్, శివ, మహేష్, ఆటో రామాంజి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పామిడి: గజరాంపల్లి గ్రామంలో మంగళవారం జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా సీనియర్ నేత ఎస్ అనిమిరెడ్డి ఆధ్వర్యంలో నాయకులు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం మా నమ్మకం నువ్వే జగన్ కరపత్రాలను ఇంటింటికి పంపిణీ చేశారు. సర్పంచ్ రంగమ్మ, అచ్చన్న, స్టోర్ డీలర్లు జయరామిరెడ్డి, వెంకటేష్, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఇంజినీర్‌గా గురప్ప యాదవ్

గుంతకల్లుటౌన్: గుంతకల్లు సబ్ డివిజన్ పబ్లిక్ హెల్త్ డీఈ కె.గురప్ప యాదవ్‌కు గుంతకల్లు మున్సిపల్ ఇంజినీర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ పీహెచ్ ఈఎన్‌సీ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఎంఈగా పనిచేస్తున్న విశ్వనాథ్ అనారోగ్యంతో సెలవులో ఉండటంతో ఆయన స్థానంలో గురప్పయాదవ్‌కు బాధ్యతలు అప్పగిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

కస్తూర్బాలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

యల్లనూరు: కస్తూర్బా బాలికా విద్యాలయంలో ప్రవేశానికి ఈనెల 30లోపు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చని మంగళవారం ప్రత్యేకాధికారి మాధవిరెడ్డి తెలిపారు. అనాథ, బడిమానేసిన, బడిబయట పిల్లలు, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ బాలికలు అర్హులన్నారు. 2023–2024 సంవత్సరానికి సంబంధించి 11వ తరగతి సీఈసీ గ్రూపులో 40 సీట్లు, 6వ తరగతిలో 40 సీట్లు, 8వ తరగతిలో 6 సీట్లు, 9వ తరగతిలో 2 సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు.

డ్రైవర్‌కు గాయాలు

గుత్తి: పట్టణంలోని గుంతకల్లు రోడ్డులో ట్రాక్టర్ లో నుంచి కిందకు దిగుతూ ప్రమాదవశాత్తు కాలు జారి కింద పడి డ్రైవర్ శేఖర్‌కు గాయాలయ్యాయి. కొజ్జేపల్లి నుంచి గుత్తికి ఇటుకలు తీసుకెళ్లడానికి ట్రాక్టర్ వచ్చింది. అయితే గుంతకల్లు రోడ్డులో టీ తాగడానికి డ్రైవర్ శేఖర్ ట్రాక్టర్ ఆపి కిందకు దిగుతుండగా కాలు జారి కింద పడ్డాడు. ప్రమాదంలో తలకు గాయమైంది. స్థానికులు వెంటనే అతన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఎస్సీల పురోగతి జగనన్నతోనే సాధ్యం


రామాంజనేయులును సన్మానిస్తున్న ఎమ్మెల్యే వైవీఆర్

గుంతకల్లుటౌన్: రాష్ట్రంలోని ఎస్సీలకు ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో అత్యంత ప్రాధాన్యత కల్పించి వారి పురోగతికి పాటుపడుతున్న ఏకైక సీఎం వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి అని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం జోనల్(అనంతపురం, శ్రీసత్యసాయి, చిత్తూరు, అన్నమయ్య) ఇన్‌చార్జ్‌గా మాజీ మున్సిపల్ చైర్మన్ జింకల రామాంజినేయులు నియమితులయ్యారు. ఈ సందర్భంగా మంగళవారం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రామాంజనేయులును ఎమ్మెల్యే శాలువా, పూలమాలతో సన్మానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావం నుంచి అహర్నిశలు పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేస్తున్న రామాంజనేయులుకు అధిష్టానం తగిన గుర్తింపు ఇవ్వడం సంతోషదాయకమన్నారు. ఎస్సీల సంక్షేమం, అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఫలాలను వారికి చేరవేయడంతో పాటు వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యే, బీసీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామలింగప్పను ఎస్సీసెల్ నాయకులు గజమాలతో సత్కరించి అంబేడ్కర్ చిత్రపటాలను అందజేశారు. ఎస్సీసెల్ జోనల్ ఇన్‌చార్జ్ పదవిని తనకు అప్పగించినందుకు సీఎం జగన్, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ రంగయ్య, ఎమ్మెల్యే వైవీఆర్‌లకు రామాంజనేయులు కృతజ్ఞతలు తెలిపారు.

శంకరాచార్యుల జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలి


శంకరాచార్యుల చిత్ర పటానికి పూజలు చేస్తున్న జానకిరామశర్మ తదితరులు

తాడిపత్రి టౌన్: జగద్గురు ఆది శంకరాచార్యుల జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని తాడిపత్రి బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు జానకిరామశర్మ సూచించారు. స్థానిక ఏటిగడ్డపాలెం నూతన బ్రాహ్మణ భవన్‌లో మంగళవారం ఆది శంకరాచార్యుల జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. జగద్గురు ఆది శంకరాచార్యుల చిత్ర పటానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య గణపతి హోమం, రుద్రాభిషేకం జరిగింది. అనంతరం జరిగిన సమావేశంలో స్థానిక బ్రాహ్మణ సంఘ అధ్యక్షుడు జానకిరామశర్మ మాట్లాడుతూ బ్రాహ్మణ సంఘం బలోపేతానికి ప్రతి బ్రాహ్మణుడు ముందుకు రావాలన్నారు. హిందు మత పరిరక్షణ కోసం అవతరించిన సరళ సిద్ధాంత వేత్త ఆది శంకచార్యులన్నారు. సంఘం గౌరవాధ్యక్షుడు వేణుగోపాల్‌రావు, కార్యదర్శి యల్లయ్యస్వామి, కోశాధికారి హరిప్రసాద్, సభ్యులు రవి శర్మ, హర్షశర్మ, రామకృష్ణ శర్మ, చిన్న విశ్వం, ప్రసాద్, నాగరాజు, ఆనందశర్మ, నాగసాయి, గుడి గోపాలరావు, కృష్ణమూర్తిరావు, ఆర్టీసీ శర్మ పాల్గొన్నారు.

పామిడి: స్థానిక నగరేశ్వరాలయంలో మంగళవారం సనాతన బ్రహ్మణ సంఘం ఆధ్వర్యంలో జగద్గురువు ఆది శంకరాచార్యుల జయంత్యుత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా వేదపండితులు భాస్కర్‌రావు ఆది శంకరాచార్య–మానవ పంచభూతాలు అనే అంశంపై సుదీర్ఘ ప్రవచనం చేశారు. జగద్గురువు ఆది శంకరాచార్యుల విగ్రహాన్ని పల్లకీలో ఉంచి ప్రాకారోత్సవం గావించారు.

ఆర్బీకే ఆకస్మిక తనిఖీ


ఆర్బీకే సిబ్బందితో మాట్లాడుతున్న జేడీఏ చంద్రానాయక్

పామిడి: ఎద్దులపల్లి ఆర్‌బీకేను మంగళవారం జేడీఏ చంద్రానాయక్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన ఆర్‌బీకే రికార్డులను పరిశీలించారు. రైతులకు ఎంతమేరకు ఎరువులు, విత్తనాలు, పురుగులమందులు అవసరమో తెలుసుకుని వెంటనే వాటిని ఏర్పాటు చేస్తామని చెప్పారు. అలాగే రైతులు ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన పంటల సాగుపై సలహాలు, సూచనలు ఇచ్చారు. సర్పంచ్ వెంకటరమణమ్మ, ఆర్‌బీకే, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హజ్‌యాత్రలో నియమాలపై అవగాహన

అనంతపురం సప్తగిరి సర్కిల్: హజ్ యాత్రలో నియమాలపై ప్రభుత్వ ఖ్వాజీ మౌలానా హారూన్ రషీద్ అవగాహన కల్పించారు. మంగళవారం స్థానిక పీటీసీ ఎదుట ఉన్న చాందినీ మసీదులో జిల్లా స్థాయి హజ్ యాత్రికుల శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా హజ్ యాత్రలో పాటించాల్సిన నియమాలపై వారికి వివరించారు. జిల్లాలోని గుత్తి, ఉరవకొండ, పామిడి, అనంతపురం ప్రాంతాలకు చెందిన హజ్ యాత్రికులు హాజరయ్యారు. ఆయన వారికి హజ్ యాత్రలో పాటించాల్సిన సూచనలపై వివరించారు.

సమయపాలన పాటించండి

గుత్తి: అంగన్‌వాడీ కార్యకర్తలందరూ సమయపాలన పాటించాలని సీడీపీఓ నాగమణి, ఏసీడీపీఓ డిల్లీశ్వరి ఆదేశించారు. పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో మంగళవారం అంగన్‌వాడీ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలను కచ్చితంగా సమయానికి తెరవాలన్నారు. పిల్లలందరూ హాజరు అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు ప్రియాంక, నాగేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

గడ్డివాముల దగ్ధం

పెద్దవడుగూరు : చిన్నవడుగూరు గ్రామంలో మంగళవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఐదు గడ్డివాములు దగ్ధమయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు.. మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో ఇళ్ల మధ్యలో ఒక్కసారిగా విపరీతమై పొగ వ్యాపించడంతో గ్రామస్తులు అప్రమత్తమయ్యారు. అప్పటికే వెంకటేష్‌రెడ్డి, బాస్కర్ రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డికి చెందిన వాములకు అగ్నికీలలు వ్యాపించాయి. గట్టిగా కేకలు వేస్తూ మంటలను ఆర్పడానికి గ్రామస్తులు ప్రయత్నిస్తుండగానే గడ్డివాము కు సమీపంలోని సుదర్శన్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి గడ్డివాములకు కూడా మంటలు వ్యాపించాయి. మంటల ఆర్పడానికి ఎంత ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. అగ్నిమాపక సిబ్బంది వచ్చే సరికి పశుగ్రాసం మొత్తం కాలి పోయింది. సుమారుగా రూ.5 లక్షలు నష్టం వాటిల్లినట్లు బాధిత రైతులు వాపోయారు.

పోటీల్లో గుంతకల్లు విద్యార్థి ప్రతిభ

గుంతకల్లు: గోదావరి తెలుగు ప్రతిభ పరీక్ష పోటీల్లో గుంతకల్లుకు చెందిన భాష్యం విద్యార్థి వీ.ఎం.సుజాత రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ బి.భార్గవి మంగళవారం తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన పోటీల్లో 60 మార్కులు గాను 58 మార్కులు సాధించి తొలి స్థానంలో నిలిచినట్లు ఆమె వివరించారు. మంగళవారం సాయంత్రం మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న విద్యార్థి సుజాతను అభినందించారు. తెలుగు ఉపాధ్యాయుడు సూరీడు ఉన్నారు.

అనారోగ్యంతో వలంటీర్ మృతి

గార్లదిన్నె: కల్లూరు గ్రామ సచివాలయం–2లో గ్రామ వలంటీర్‌గా పని చేస్తున్న ప్రభాకర్(27) మంగళవారం మృతి చెందారు. స్థానికులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన ప్రభాకర్ గ్రామ వలంటీర్‌గా పని చేసేవాడు. మూడు రోజుల క్రితం అనారోగ్యంతో అనంతపురం ప్రభుత్వాస్పత్రిలో చేరాడు. పరిస్థితి విషమించడంతో అక్కడే మృతి చెందాడు.

ఇద్దరు టీచర్లకు బదిలీలు

రాప్తాడురూరల్: ఉమ్మడి జిల్లాలో ఇద్దరు టీచర్లను కోర్టు ఆదేశాలు, కమిషనర్ ఉత్తర్వుల మేరకు అంతర్ జిల్లా బదిలీలు చేశారు. ప్రకాశం జిల్లాలో బయాలజీ స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న బి.రామకృష్ణ, కర్నూలు జిల్లాలో బయాలజీ అసిస్టెంట్‌గా పని చేస్తున్న జి.లలిత గతంలో అంతర్ జిల్లా బదిలీల్లో జిల్లాకు వచ్చారు. అయితే నిబంధనల మేరకు కేటగిరి 3, 4 పాఠశాలల్లో ఖాళీలను మాత్రం చూపించారు. రామకృష్ణ గుడిబండ మండలం జంబులదిన్నె జెడ్పీహెచ్ఎస్‌ను కోరుకోగా, లలిత మాత్రం చేరకుండా వెనక్కు వెళ్లిపోయారు. స్పౌజ్‌గా ఉన్న వీరిద్దరూ కోర్టుకు వెళ్లారు. స్పౌజ్‌కు దగ్గర్లో ఉన్న ఖాళీల్లో నియమించాలని ఆదేశించడంతో రామకృష్ణను పుట్టపర్తి మండలం ఎనుమలపల్లి జెడ్పీహెచ్ఎస్, లలితను అనంతపురం రూరల్ మండలం పాపంపేట జెడ్పీహెచ్ఎస్‌కు బదిలీ చేస్తూ డీఈఓ సాయిరామ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.